రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

రాజేంద్రనగర్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమా అన్నారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 14,810 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్, 13వ న్యాయమూర్తి అంకిత్ సర్వ, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి నజీరుద్దీన్, ఏపీపీలు శీనయ్య, ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ సుగుణ, పీటీ సత్యనారాయణ మాట్లాడుతూ..రాష్ట్ర నెట్‌బాల్ స్కూల్ గేమ్స్ డిసెంబర్ 19–21వ తేదీ వరకు ఇబ్రహీంపట్నంలో నిర్వహించారన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని యు.సుకన్య ప్రతిభ చూపడటంతో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైందన్నారు. జనవరి 3 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అలాగే 9వ తరగతి విద్యార్థిని కె.అను సఫెక్ టాక్రా పోటీల్లో ప్రతిభ చూపడటంతో జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. పాట్నాలో 22వ తేదీ నుంచి నిర్వహించనున్న పోటీల్లో అను పాల్గొంటుందన్నారు. తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్కూల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

దేవాలయం భూమి సర్వేపూర్తి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్రజీ దేవాలయం భూమి కబ్జా సర్వే పూర్తయింది. సర్వేనంబరు 668లో శ్రీ రామచంద్రజీ దేవాలయం భూమి మొత్తం7.18 ఎకరాల భూమి ఉంది. దేవాలయం ఉన్న ఈ భూమిలో ఇరువైపులా అక్రమార్కులు కబ్జాకు పాల్పడ్డారు. గతంలో రెండు సర్వేలు పూర్తి చేయించిన దేవాదాయ శాఖ అధికారులు తాజాగా శనివారం ఈవో మోహన్ రావు ఆధ్వర్యంలో ఏడీ సర్వే చేయించారు. ఆలయానికి ఇరువైపులా, వెనక భాగంలో కబ్జాకు గురికావడంతో రెవెన్యూ సర్వేతో పాటు ఏడీ సర్వే చేయించినట్లు ఈవో మోహన్‌రావు తెలిపారు. గగన్‌పహాడ్ పరిధిలో ఉన్న ఆలయ భూములపై కూడా కోర్టుతో పాటు ట్రిబ్యునల్‌లో కేసు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారం రోజులో వాస్తవ నివేదిక అందనున్నటు అధికారులు తెలిపారు.


నార్సింగిలో దరఖాస్తుల కేంద్రాన్ని పరిశీలించిన అశోక్‌యాదవ్


పిల్లోనిగూడలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వసంతలక్ష్మి


నార్సింగిలో కేంద్రం సందర్శించిన నోడల్ అధికారి శ్రీనివాసులు

దరఖాస్తుల స్వీకరణ.. కేంద్రాల సందర్శన

- కొనసాగుతున్న దరఖాస్తుల అందజేత
- బారులుదీరుతున్న ప్రజలు
- రేషన్ కార్డు, భూసమస్యల పరిష్కారం కోసమూ విన్నపాలు

శంషాబాద్ రూరల్: ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరిస్తున్న ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తులతో పాటు ఇతర సమస్యలపై కూడా గ్రామస్తులు అర్జీలు పెట్టుకుంటున్నారు. రేషన్ కార్డులు, భూ రికార్డుల సమస్యలు, సీసీ రోడ్డు, భూగర్భ మురుగు కాలువలు, తాగునీటి సమస్యలపై కూడా అధికారులకు రాతపూర్వకంగా విన్నవించుకుంటున్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ రకంగా 425 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వసంతలక్ష్మీ, తహసీల్దార్ నాగమణి, ఎంపీఓ ఉషాకిరణ్, ఏఓ కవిత, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దు..

మణికొండ: ప్రజాపాలనలో ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు సంపూర్ణ సమాచారంతో ఉండేలా చూసుకోవాలని నియోజకవర్గ నోడల్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శనివారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన లబ్ధిదారులకు పథకాలు అందాలంటే వారి దరఖాస్తు సరిగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

అర్హులందరికీ అందాలి..

మణికొండ: అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ మర్రిచెట్టు సర్కిల్‌లో–13వ వార్డులో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందరికీ అందక ఎంతో మంది ఇబ్బందులు పడ్డారని అలాంటి వారిని గుర్తించి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వారితో దరఖాస్తులు చేయించాలన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని 6వ వార్డులో ఏర్పాటు చేసిన దరఖాస్తుల కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావుతో కలిసి పరిశీలించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో కౌన్సిలర్ పి. శైలజవినోద్, 15వ వార్డులో బి.కావ్యశ్రీరాములులు దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు బి. శ్వేతరవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రహమత్ బేగ్

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో అభయ హస్తం కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసిందని జనవరి 6వ వరకు వార్డుల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.


సుల్తాన్‌పల్లిలో దరఖాస్తులు తీసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల నుంచి శనివారం 24676 దరఖాస్తులను స్వీకరించినట్లు సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలో ఏర్పాటు చేసిన కేంద్రాల నుంచి స్వీకరించామన్నారు. శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలో కేంద్రాలను మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రమహత్ బేగ్ సందర్శించి మాట్లాడారు. కౌంటర్ల వద్ద రద్దీ అధికంగా ఉండటంతో మరింత సిబ్బందిని నియమించాలన్నారు.


మణికొండ మర్రిచెట్టు సర్కిల్ దరఖాస్తులను తీసుకున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్


కాచారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీఓ ఉషాకిరణ్


మణికొండ 16వ వార్డులో దరఖాస్తులు తీసుకున్న కౌన్సిలర్ శైలజవినోద్

సన్మానం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పి. లక్ష్మి శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆమెను విశ్వవిద్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటరమణ, తోటి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గాలిదొడ్డిలో అయ్యప్ప పూజ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గాలిదొడ్డిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహిస్తున్నట్టు గురుస్వామి డి. ప్రభాకర్ తెలిపారు. గురుస్వామి గోపాల్‌సింగ్ చేతుల మీదుగా నిర్వహించే మహాపడి పూజలో పెద్దపులి ఈశ్వర్ భజన, డి. ప్రమీల, సత్యనారాయణల అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు, అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శ్రీ విజయ గణపతి దేవాలయంలో ఆలయ కమిటీ రూపొందించిన నూతన కేలండర్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్య దైవారాధన ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాందాస్ ముదిరాజ్, గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, టింకురెడ్డి, సాయిబాబాగౌడ్, పాపయ్యయాదవ్, దశరథ్, సదానందంగౌడ్ పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న లక్ష్మిఈశ్వరి


మణికొండ: పెరుగుతున్న యాప్‌లు, ఫోన్‌లు వాడే విధానం సరిగా లేకపోతే పెద్ద అనర్థం జరుగుతుందని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించటం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని హైదరాబాద్ సీ–డాక్ డైరెక్టర్ పీఆర్ లక్ష్మీఈశ్వరి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన సైబర్ సెక్యూరిటీలో ఇటీవల పోకడలపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండాలని నేటి ప్రపంచంలో హ్యాకర్లకు అవకాశం లేకుండా తమ ఎలక్ట్రానిక్స్ పరికరాలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ రంగంలో వస్తున్న మార్పులు, బెదిరింపు సవాళ్లపై ఇంజినీరింగ్ విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద, సెమినార్ కన్వీనర్, ఐటీ హెచ్‌ఓడీ డాక్టర్ బి.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు

మణికొండ: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం పల్లకిలో ఊరేగించారు. వాటిని ముందుగా హనుమాన్ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధులగుండా పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అక్షింతలు ఉన్న పల్లకికి హారతులు, కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌యాదవ్, వినోద్‌కుమార్, రాము, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీలో..

మణికొండ: అయోధ్య శ్రీరాముని అక్షింతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పలు కాలనీలలో అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు మణికొండ పార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం అనేక కాలనీలలో వాటిని ఊరేగించారు. భక్తులు అక్షింతలకు మంగళహారతులు, కోలాటాలతో స్వాగతం పలికారు.


మణికొండ శివాలయంలో అక్షింతలకు పూజలు చేసిన భక్తులు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్‌లో..

అత్తాపూర్: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో నగరానికి చేరుకున్న శ్రీరామ మందిర అంక్షితలు శనివారం అత్తాపూర్‌లోని వెంకటేశ్వర కాలనీ, చైతన్య విలాస్, సిరి ఎన్‌క్లేవ్స్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, ఫ్లైజెంట్ పార్కు తదితర ప్రాంతాల్లో నగర సంకీర్తన ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ పోకడలను అధ్యయనం చేయాలి

రాయదుర్గం: మేనేజ్‌మెంట్ కోర్సు చదివే విద్యార్థులు గ్లోబల్ మేనేజర్లుగా ఎదగాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ జీవిఆర్‌కే ఆచార్యులు సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలలో భాగంగా గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో ఆధునిక పోకడలు' అనే అంశంపై జాతీయ సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులు వర్చువల్ మోడ్‌లో చదువుకోవచ్చన్నారు. టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలలో ప్రపంచ పోకడలను అధ్యయనం చేయాలని, అందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి మాట్లాడారు. హెచ్‌ఓడీ ప్రొఫెసర్ టి రవి మాట్లాడుతూ నిర్ణయం, అమ్మకాలు, మార్కెట్, బ్యాంకింగ్ రంగం, కస్టమర్ సేవ వంటి నిర్వహణ రంగంలో కృత్రిమ మేధస్సు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఆచార్యులు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సేయింట్ జేవియర్స్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కె సుధీర్, చైర్మన్ టి రాఘవరెడ్డి, పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, అధికారులు, ఎంబీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రొ.జీవిఆర్‌కే ఆచార్యులు

శేరిలింగంపల్లి సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సమావేశంను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయనను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీ కారిడార్‌లోని హాస్టళ్ళ సమస్యలను తీర్చడానికి ముందుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హాస్టల్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమర్‌నాథ్‌రెడ్డి, తాతా కరుణాకర్, నాగిరెడ్డి, మహేందర్, సంజయ్, వేణు, మధు,చంద్రశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య అక్షింతల ర్యాలీ

రాయదుర్గం: అయోధ్య రామాలయం అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి టెలికామ్‌నగర్‌లో నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కాషాయపతాకాలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు డి రవీంద్రరెడ్డి, దినేష్‌యాదవ్, వెంకటేష్, శివసింగ్,విఠల్, గోపాల్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రొ.సమర్‌కుమార్ దాస్‌కు జేసీ బోస్ ఫెలోషిప్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ సమర్‌కుమార్‌దాస్ ప్రతిష్టాత్మకమైన జేసీబోస్ ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్. పునరుత్పాదక శక్తి వనరులు మన నుంచి రోజుకోజుకూ క్షీణించడమే కాదు, నేటి సమాజ అవసరాల నేపథ్యంలో స్థిరమైన/పునరుత్పాదక శక్తిని సాధించడంలో ఆయన చేసిన పరిశోధనకు ఈ ఫెలోషిప్ లభించింది. జేసీబోస్ ఫెలోషిప్ వ్యవధి అయిదేళ్లు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

అభినందన

రాయదుర్గం: రాష్ట్ర హోంగార్డుల గౌరవ అధ్యక్షుడు తాండూరు శాసనసభ్యులు బి మనోహర్‌రెడ్డిని రాష్ట్ర హోంగార్డుల సంఘం ప్రతినిధులు శనివారం కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్‌స్వామి ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డిని అభినందించారు. హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చూడాలని కోరినట్లు సైబరాబాద్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్ తెలిపారు.

31న డ్రంకెన్ డ్రైవ్‌లతో పాటు ప్రత్యేక తనిఖీలు


మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్

రాజేంద్రనగర్: డిసెంబర్ 31న రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లతో పాటు ప్రత్యేక తనిఖీలను నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..31వ తేదీ రాత్రి 8 గంటల నుంచి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేతో పాటు ఓఆర్‌ఆర్‌పై నిషేధం ఉంటుందన్నారు. కేవలం ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారు ఎయిర్‌పోర్టుకు సంబంధించిన పత్రాలను తనిఖీ పోలీసులకు సూచించాలన్నారు. రాత్రి 8 గంటల నుంచి 1వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధం ఉంటుందన్నారు. ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాల తనిఖీలతో పాటు డ్రంకెన్ డ్రైవ్‌లు కొనసాగుతాయన్నారు.

ఆకట్టుకున్న ఇంగ్లీష్ ఫేర్



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు ఆంగ్ల భాషపై మక్కువ కలిగేలా, వ్యాకరణంపై అవగాహనను తెలిపేలా నిర్వహించిన ఇంగ్లీష్ ఫేర్ ఆకట్టుకుంది. శనివారం సన్‌సిటీ గౌతమ్ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ మార్లీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. విద్యార్థుల ద్వారా ఆంగ్ల వ్యాకరణంలోని అంశాలను ఆహూతులకు తెలియపర్చారు. ప్రకృతి గొప్పతనాన్ని విద్యార్థులు నాటికల రూపంలో ప్రదర్శించి అలరించారు. కార్యనిర్వాహకులు విశ్వనాథ్ గజ్రే, వినోద్ చావ్లే, అశోక్ గజ్రే, వాసవి కాలేజీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఝాన్సీ, మీనా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీల విజేత శివాంసికకు సత్కారం

అత్తాపూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–14 విభాగంలో జాతీయ చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో విజేతగా నిలిచిన అత్తాపూర్ జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని శివాంసికను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.



శబరిమలకు బయలుదేరిన స్వాములు



రాజేంద్రనగర్: అయ్యప్ప స్వామి నామస్మరణతో ప్రేమావతిపేట శివాలయంలో మార్మోగింది. పాండురంగా గురుస్వామి ఆధ్వర్యంలో దేవాలయంలో స్థానిక ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు ఇరుముడులతో శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శేఖర్, శ్రీకాంత్, విష్ణువర్ధన్, రవి, జగన్, అంతులు, సిద్ధు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.